www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 24 జూలై 2022 | ఎడిటర్: గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-110 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



# భారత స్వాతంత్ర్యవజ్రోత్సవ ద్విసప్తాహం



- వాడవాడాలో పక్షం రోజుల పాటు కార్యక్రమాలు
- ఇంటింటా జెండాల ఎగురవేతకు నిర్ణయం
- క్రీడా, వ్యాసరచన పోటీలు, కవిసమ్మేళనాలు
- ప్రగతిభవన్‌లో అధికారులతో సిఎం కెసిఆర్ సమీక్ష

**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా.. స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల త్యాగాలు, పోరాట ఫలాలు నేటి తరానికి అర్థమయ్యేలా, దేశభక్తిని ద్విగుణీకృతం చేసేలా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు రూపొందించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. గడప గడపకూ, వాడ వాడనా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని, క్రీడాపోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు, కవిసమ్మేళనాలు, జాతీయ భావాలను రగలించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజైన 15 ఆగస్ట్ ముందు వారం రోజులు.. అనంతరం వారం రోజులుగా.. 15 రోజుల పాటు 'భారత స్వాతంత్య్ర వజ్రోత్సవ ద్విసప్తాహ' కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 75 ఏండ్ల ' స్వతంత్య్ర భారత వజ్రోత్సవ ద్వి సప్తాహం' నిర్వహణపై శనివారం నాడు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'అటు దేశవ్యాప్తంగా ఇటు తెలంగాణలో, దేశ స్వాతంత్య్ర కోసం సాగిన పోరాటాలు, జరిగిన త్యాగాలు, నాటి జాతీయ నాయకులు, అమరుల వివరాలు నేటి తరానికి అర్థం కావాల్సివున్నది. 75 ఏండ్ల కాలంలో స్వతంత్ర్య భారతం ఎన్నో ఘన విజయాలను సాధించింది. ప్రపంచ దేశాల్లో అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా భారత దేశం పరిఢవిల్లుతున్నది. భారత స్వాతంత్య్ర సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న భారత దేశాన్ని మరింత గుణాత్మకంగా రూపొందించుకోవాల్సి ఉన్నది. నాడు వారు పొందుపరిచిన ప్రజాస్వామిక, లౌకిక వాద, సమాఖ్యవాద విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారత పౌరునిమీదున్నది. భారత దేశం 3వ

## అతిగా వ్యవహరిస్తున్న మీడియా



- కోర్టులకన్నా ముందే తీర్పులు ఇచ్చేస్తోంది
- అపరిపక్వ చర్చల ద్వారా ప్రజాస్వామ్య అపహాస్యం
- రాంచీలో జరిగిన ఓ కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ రమణ

**రాంచీ, జూలై 23 (సమ సమాజం):** ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాపై చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఫైర్ అయ్యారు. జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మీడియా కంగూరు కోర్టులను నడిపిస్తోందని ఆరోపించారు. కొన్ని కేసుల్లో అనుభవజ్ఞులైన జడ్జిలు కూడా ఇవ్వలేని తీర్పులను మీడియా ఇస్తోందని ఆయన అన్నారు. అపరిపక్వ చర్చల ద్వారా ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని దెబ్బ 3వ

## విమానంలో ప్రయాణికుడికి ఉపశమనం

ప్రాథమిక చికిత్సఅందించిన గవర్నర్ తమిళసై



**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** విమానంలో తీవ్ర అస్వస్థతకు గురైన ప్రయాణికుడికి గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ప్రాథమిక చికిత్స అందజేశారు. ఢిల్లీ - హైదరాబాద్ ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు అర్ధరాత్రి సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. విమానం గాల్లో ఉన్న సమయంలో ప్రయాణికుడికి చెస్ట్ పెయిన్, ఇతర సమస్యలతో బాధపడ్డాడు. దీంతో అప్రమత్తం అయిన విమాన సిబ్బంది ఆ విమానంలో ఎవరైనా డాక్టర్‌లు ఉన్నారా అని అనౌన్స్ చేశారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న 3వ

## తెలంగాణలో కొత్తగా 13 మండలాలు ఏర్పాటు

ఉమ్మడి నిజామాబాద్‌లో కొత్తగా 4 మండలాలు

నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** తెలంగాణలో కొత్తగా 13 మండలాలు ఏర్పాటు అయ్యాయి. ప్రజల ఆకాంక్ష, స్థానిక ప్రజా అవసరాలను పరిశీలించి, పరిపాలనా సంస్కరణల్లో భాగంగా మరికొన్ని మండలాలను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పలు జిల్లాల్లో కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు కొత్త మండలాలకు సంబంధించిన ఉత్తర్వులను ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు. ప్రజా ఆకాంక్షలు, స్థానిక ప్రజా అవసరాలను పరిశీలించి మరికొన్ని మండలాలు ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ జిల్లాల్లో నూతన మండలాల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి నిజామాబాద్‌లో కొత్తగానాలుగు మండలాలు ఏర్పటు కానున్నాయి. నారాయణపేట జిల్లాలో 3వ

## దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

మహీంద్రా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో కేటీఆర్






**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ నిర్వహించిన తొలి స్నాతకోత్సవంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. దేశ జనాభాలో సగానికి పైగా 27 ఏండ్ల వారేనని తెలిపారు. ప్రస్తుతం యువత ఆవిష్కరణల్లో చాలా చురుకుగా ఉందని కొనియాడారు. నాయకులు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ఆర్థిక అంశాలపై దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మహీంద్రా యూనివర్సిటీలో చదువుతున్నారని తనకు తెలుసన్నారు. అయితే హైదరాబాద్, తెలంగాణలో ఉన్న ఉద్యోగ అవకాశాలను 3వ

## రాజకీయపార్టీలు పక్షపాత ధోరణివీడాలి

దేశంకోసం ఐక్యంగా పనిచేయాలి

వీడ్కోలు సమావేశంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



**న్యూఢిల్లీ, జూలై 23 (సమ సమాజం):** పక్షపాత ధోరణికి అతీతంగా రాజకీయ పార్టీలు నడుచుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారు. రాష్ట్రపతిగా దేశానికి సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. 3వ

## రాజ్‌భవన్‌లో బోనాల సందడి

స్వయంగా బోనమెత్తిన గవర్నర్ తమిళసై



**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** రాజ్‌భవన్‌లోని అమ్మవారి గుడి ప్రాంగణంలో బోనాలు పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగలో భాగంగా గవర్నర్ తమిళి సై స్వయంగా బోనమెత్తారు. గవర్నర్ తన నివాసం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి 3వ

## ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జూలై 23 (సమ సమాజం):** ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల్లో నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తవుతుందని, తుది దశకు కళాశాల నిర్మాణ పనులు చేరాయన్నారు. ఐదుల్యాబ్‌లు, రెండు లెక్చర్ హాళ్ల నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణకు అనుగుణంగా భవనాలు సిద్ధమయ్యాయని, అనుమతులు పూర్తయిన వెంటనే ఎంసెట్ కౌన్సెలింగ్‌లో వనపర్తి మెడికల్ కళాశాల ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు వచ్చే వరకు పూర్తి స్థాయిలో కళాశాల, వసతిగృహాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వనపర్తి మెడికల్ కళాశాల క్యాంపస్ మిగతా కళాశాలలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు అదృష్టవంతులు అనడంలో సందేహం లేదన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి అన్నివిధాలా అనుకూల వాతావరణం ఉందన్నారు. భవన నిర్మాణానికి కృషి చేసిన అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఆయాశాఖల అధికారులు ఉన్నారు

## భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి



అధికారులకు సిఎస్ సోమేశ్ కుమార్ ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో 3వ

## తండ్రీకొడుకులు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు



సిఎం కెసిఆర్,కెటిఆర్‌పై రేవంత్ ట్వీట్

**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్‌లకు జనం మధ్య తిరిగే పరిస్థితి లేదని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. తండ్రి, కొడుకులు ప్రజల మధ్య స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదంటూ ఆయన ట్వీట్ చేశారు. ట్విట్టర్ పిట్టకు నిన్న మెట్‌పల్లిలో చెరకు రైతులు, నేడు సిరిసిల్లలో వీఆర్ఏల సెగ తగిలింది. కేసీఆర్‌కు భద్రాచలంలో వరద బాధితుల నిరసన తెలిసిందే. ఇక తండ్రి కొడుకులు జనం మధ్య స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు. బంగారు తెలంగాణ క్షేత్రంలో వాస్తవ పరిస్థితి ఇది. అంటూ మంత్రి కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.శుక్రవారం మంత్రి కేటీఆర్ సొంత నియోజక వర్గమైన సిరిసిల్లలో పర్యటించారు. ఈ పర్యటనలో మంత్రి కేటీఆర్ కు నిరసన సెగ తగిలింది. సిరిసిల్ల పట్టణంలో నిరసన చేస్తున్న వీఆర్‌వోలు మంత్రి కేటీఆర్ కాన్వాయ్ ని అడ్డుకున్నారు.

## బండి సంజయ్ రెండో విడత ప్రజాసంగ్రామ యాత్ర

ఆగస్టు 2న యాదాద్రి నుంచి ప్రారంభం

**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టనున్న మూడో విడత ప్రజా సంగ్రామ పాదయాత్ర ఆగస్టు 2న యాదాద్రి నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి యాత్ర ఇంఛార్జ్, మునుగోడు నియోజకవర్గ పార్టీ బాధ్యులైన గంగిడి మనోహర్‌రెడ్డితో పాటు భువనగిరి పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులు, ముఖ్య నేతలతో ఇప్పటికే పార్టీ రాష్ట్ర నాయకత్వం సమీక్ష నిర్వహించింది. తాజాగా 3వ



## సమస్యలు పక్కనపెట్టి సెలవులు ప్రకటన

బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థుల మండిపాటు

**నిర్మల్, జూలై 23 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించమంటే సెలవు ఇచ్చారంటూ మండిపడ్డారు. ఇటీవల జరిగిన చర్చల్లో విద్యార్థుల డిమాండ్ల పరిష్కారానికి రేపటితో గడువు ముగియ నుండగా, మరో 48 గంటలే ఉందంటూ విద్యార్థులు శుక్రవారం ట్వీట్ చేశారు. అయితే విద్యార్థులు ఇలా ట్వీట్ చేసిన గంటకే సెలవులు ప్రకటన ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించమంటే సెలవులు ఇచ్చారని, సెలవులు ఇస్తే ఎవరికి వారు ఇంటి దారి పడుతారని అందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో సమస్యలు పరిష్కరిస్తామని సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరం కాలేదని విద్యార్థులు తెలుపుతున్నారు.రెండు రోజుల క్రితం కూడా విద్యార్థులు తిన్న ఆహారం కలుషితం అవ్వడం పెద్ద చర్చానీయాంశమైంది.

## కెసిఆర్ విప్లవాత్మక విధానాలు

ప్రపంచ పెట్టుబడులకు నిలయంగా హైదరాబాద్

ఆస్పైర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సేవల ప్రారంభంలో హరీశ్‌రావు

**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మకమైన విధానాలు ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్‌ను నిలయంగా మార్చాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి 3వ

ఆది వారం, 24. 07. 2022
www.aksharavelugu.com
సమ సమాజం



## సంపాదకీయం

# రైతుల ఉసురు తీస్తున్న వానలు !

వానల రాకడతో ప్రకృతి కొత్త ఊపిరి పోసుకుంటోంది. అయితే అతి వర్షాలు మనలను ఊపిరి సలపకుండా చేస్తున్నాయి. దీనికంతటికీ వాతావణ మార్పులే కారణం.ప్రకృతి విధ్వంసం ఇలాగే కొనసాగుతూ పోతే మనం విపరీత పరిణామాలనే ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు తాజా వరదలు,వర్షాలను ఉదాహరణగా చూడాలి. ప్రజలు, పాలకులు కలసి ఇందుకు బాధ్యత వహించాలి. మొన్నటి ఎండాకాలం భరించరానంత వేడిమితో ఉక్కపోసింది. ఇప్పటికీ యూరోప్ దేశాలు అల్లాడి పోతున్నాయి. ఎండల వేడిమికి తాళలేక పోతున్నారు. ఇదంతా కూడా ప్రకృతి ప్రకోపంగానే చూడాలి. అతిగా ఎండలు, అతిగా వర్షాలు, అతిగా చలి అన్నవి మానవులుతమకుతాము సృష్టించుకున్న వైపరీత్యాలు తప్ప మరోటి కాదు. ఇకపోతే గ్రామాల్లో గొలుసుకట్టు చెరువుల మాయయ్యాయి. నగరాల్లో కాంక్రీట్ జంగగల్స్ విస్తరించాయి. ఈ కారణంగా వాన చినుకు పడగానే అది వరదలా పారుతోంది. మొత్తానికి ఈ యేడు తొలకరి జల్లులతో వర్షాకాలం వచ్చేసింది. ఉక్కపోతతో ఊపిరి సలపనివ్వకుండా ఉడుకెత్తించిన వాతావరణం చల్లబడింది. అంతేనా అంటే ఇవేమి వర్షాలు అన్న స్థాయికి చేరాం. నింగి నుంచి వానధార నేల మీదకు జలజలా జారుతుంటే వ్యాపించే మట్టి పరిమళంతో కలిగే ఆనందమే వేరు. గ్రామాల్లో కూడా మట్టిపరిమళాలు పోయాయి. కంపు వాసనలు, ప్లాస్టిక్ వ్యర్థాల రవాణాతో గ్రామాల్లో వరదలా పారుతున్నాయి. వర్షాల వల్ల కలిగే హర్షాతిరేకాలకు, వర్షాల వల్ల కలిగే విషాదాలకు అందరి కంటే ఎక్కువగా స్పందించేది రైతులే! ప్రకృతినే నమ్ముకుని బతికే కష్టజీవులు వాళ్లు. వర్షాలు సకాలంలో కురిస్తే పొంగిపోతారు. అతిగా కురిస్తే కుంగగిపోతారు. ఇప్పుడు పడుతున్న వర్షాలతో రైతులు కుంగిపోతున్నారు. వేసిన విత్తనం వృథా అయ్యింది. పంటలు నాని పోయాయి. విత్తనం మొలకెత్తని దశకు చేరుకుంది. ప్రకృతి ధర్మంలో భాగంగా రుతుపవనాలు బలంగా రావడంతో బలమైన వర్షాలు పడడం మొదలయ్యింది. గోదావరితీరం కన్నీటిసంద్రంగా మారింది. జడివానలు మొత్తం రైతాంగాన్ని దెబ్బతీసాయి. సామాన్యులను కట్టుబట్టలు లేకుండా చేశాయి.వర్షాలు సకాలంలో సజావుగా కురిస్తే, అందరికీ హర్షదాయ కమే! కురవాల్సిన సమయంలో వానలు కురవకున్నా, కురవరాని సమయంలో తెరిపి లేకుండా కురిసినా కన్నీళ్లు తప్పవు. అతిగా కురిసే వర్షాలు తెచ్చే విషాదాలు అంతాఇంతా కాదు. అక్కడక్కడా శ్రుతిమించి మితిమీరిన వానలు వరదలతో ముంచెత్తుతుంటాయి. అంతమాత్రాన వర్షాలను వద్దనుకోలేం. వర్షాలే లేకపోతే ఈ భూమ్మీద జీవమే ఉండదు. వానలు సక్రమంగా పడాలంటే భూమ్మీద వాతావరణం సరిగా ఉండాలి. అందుకే పర్యావరణ పరిరోణ మన ప్రధాన లక్ష్యం కావాలి. ఇటీవలి వర్షాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులను ,ప్రజలను కోలుకోలేని దెబ్బకొట్టాయి. ఆంధ్రాలో అనేకచోట్ల అధిక వర్షాలతో చేలలో నిలిచిన నీరు బయటకు తోడి రైతులు వరినాట్లు వేస్తున్నారు. వర్షాలకు నారుమడులు మునిగాయి. కొన్నిచోట్ల తిరిగి నారు పోయగా మరికొన్ని చోట్ల ఆలస్యంగా నాట్లు వేస్తున్నారు. అధిక వర్షాల కారణంగా వరదనీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల్లో వరిచేలు నీట మునిగాయి. ఇలా వారంరోజుల పాటు కురిసిన భారీవర్షాలకు ఇరు రాష్ట్రాల రైతాంగం చావు దెబ్బతింది. జిల్లాల్లో ప్రధాన పంటలన్నీ భారీ విస్తీర్ణంలో తుడిచి పెట్టుకపోయాయి. వేల ఎకరాలకుపైగా పత్తి పంట నీటి మునిగి మొక్కలు చనిపోగా కొన్నివేల ఎకరాల్లో కంది, ఇతర పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. వేలాది మంది రైతులు ప్రభుత్వ చేయూత కోసం ఆశగా ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఆరంభంలోనే వర్షాలు కురియడంతో రైతాంగం కోటి ఆశలతో ఉత్సాహంగా పత్తి పంట సాగు చేపట్టింది. మొక్కలు మొలచి ఏపుగా పెరుగుతున్నాయనుకుంటున్న దశలో విరుచుక పడ్డ అతివృష్టి కారణంగా రైతులు ఒక్కొక్క ఎకరాపై రూ.15వేలకుపైగా నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ పంటలు నాటే పరిస్థితి కూడా లేదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ పంటలు వేయాలనుకున్నా కంది, పెసర వంటి పప్పు దినుసులు, ఇతర చిరుధాన్యాల మినహా పత్తి సాగు చేసే పరిస్థితి లేదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా పత్తి జూన్ మొదటి వారం నుంచి జూలై రెండవ వారం లోపు మాత్రమే విత్తుకోవాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆశించిన పంట దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు. అలా కాకుండా మొండిగా కొంతమంది రైతులు మళ్లీ పత్తి సాగు చేయాలని ఆలోచిస్తే మాత్రం దిగుబడులు తగ్గటమే కాకుండా తెగుళ్లు, చీడపీడల ఉధృతి తట్టుకోవటం కష్టమని నిపుణులు చెబుతున్నారు. వర్షాల కారణంగా రెండు రాష్ట్రాల్లోనూ వేలాదిమందికిపై కౌలురైతులు ప్రభావితమైనట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం వీరంతా కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే వాస్తవిక నష్టం ఎంత..? ఎంత మంది రైతులు ప్రభావితమయ్యారు..? నష్టపోయిన విలువ ఎంత..? అనే వివరాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సాధికారిక సర్వే జరపాల్సి ఉంది. ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవటంతో నష్టం అంచనా సర్వే ఇంకా ప్రారంభించనే లేదు. అటు రైతులకు సమాధానం చెప్పలేక, ఇటు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాక వ్యవసాయాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదిలా ఉండగా పంటలు నష్టపోయిన దాదాపు వేలాది మంది రైతులు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులన్ని వరదనీటిలో కొట్టుకుపోయాయి. బ్యాంకు రుణాలు అందక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగుచేశామని రైతులు వాపోతున్నారు. గత రెండు,మూడు సంవత్సరాల నుంచి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించడం లేదని తెలంగాణ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి మాత్రం భిన్నంగా నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను వెంటనే ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రైతాంగం కోరుతోంది. వర్షాలవల్ల నష్టపోయిన పంటలస్థానంలో మళ్లీకొత్తగా ఆ పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కెసిఆర్ విప్లవాత్మక విధానాలు



(మొదటి పేజి తరువాయి) హరీశ్‌రావు స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ అధ్వర్యంలో ఐటీ రంగం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని ఐటీ సంస్థలకు గమ్యస్థానంగా హైదరాబాద్ మారిందన్నారు. ప్రపంచంలోని అతి పెద్ద బహుళజాతి సంస్థలు తమ విస్తరణ కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేశాయని తెలిపారు. గచ్చిబౌలిలోని ఆస్పైర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సేవలను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎ÷–లోరిడా, యూఎస్‌ఏ ఆధారిత సాంకేతిక సేవల సంస్థ అయిన ఫోనిక్స్ టెక్నాలజీస్ ఇక్కడ ఆస్పైర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఇచ్చేందుకు, అందుకు అనుగుణంగా ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. మూడేండ్లలో 3 వేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉండేలా విస్తరించాలని ఆకాంక్షిస్తున్నానని మంత్రి తెలిపారు. ఆవిష్కరణల విషయంలో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్లు మొన్న విడుదలైన నీతి ఆయోగ్ సూచి వెల్లడించిందని గుర్తు చేశారు. ఆవిష్కరణల సూచీల్లో కర్ణాటక, తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో ఉంటే.. గుజరాత్, బీహార్ 14, 15 స్థానాల్లో ఉన్నాయని తెలిపారు.

# బండి సంజయ్ రెండో విడత ప్రజాసంగ్రామ యాత్ర

(మొదటి పేజి తరువాయి) యాత్రకు సంబంధించి రూట్ మ్యాప్ విడుదల చేశారు.బండి సంజయ్ సంగ్రామ యాత్ర కి భారీ స్పందన వస్తుందని.. యాత్ర ప్రభావం క్షేత్ర స్థాయిలో ఉందని ప్రజా సంగ్రామ యాత్ర ఇంఛార్జ్ మనోహర్ రెడ్డి చెప్పారు. ఏడాదిలో పది పెద్ద బహిరంగ సభలు నిర్వహించిన పార్టీ బీజేపీ అని.. సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర మూడో విడత యదాద్రి నుండి ఆగస్ట్ 2న ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ లో 6 అసెంబ్లీ, వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉంటుందనన్నారు. కాగా, మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర 23 రోజుల పాటు కొనసాగనుంది. 6వ తేదీన ఉప రాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా యాత్రకు విరామం ఉంటుందని మనోహర్ రెడ్డి చెప్పారు. మొత్తం 125 గ్రామాల మీదుగా 328 కిలోమీటర్ లు యాత్ర ఉంటుందని.. ఆగస్ట్ 26 న భద్రకాళి అమ్మవారి దగ్గర ముగియనుంది. యాత్ర వెళ్ళే రూట్ లోకి అసెంబ్లీ నియోజక వర్గాల కి పార్టీ సీనియర్ నేతలు సమన్వయ కర్తలుగా నియమించామని.. భారీ బహిరంగ సభ తో యాత్ర ప్రారంభం అయ్యి భారీ బహిరంగ సభతో ముగుస్తుందని వెల్లడించారు.

# తెలంగాణలో కొత్తగా 13 మండలాలు ఏర్పాటు

(మొదటి పేజి తరువాయి) గుండుమల్, కొత్తప్లలె మండలాలు ఏర్పాటు కానున్నాయి. వికారాబాద్ జిల్లాలోని తాండూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో దుద్యాల్ మండలం కానుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కౌకుంట్ల మండలం ఏర్పాటు కానుంది. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆలూర్, డొంకేశ్వర్ కొత్త మండలాలు కానున్నాయి. జిల్లాలోని బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సాలూర మండలం ఏర్పాటు కానుంది. మహబూబాబాద్ జిల్లాలో సీరోల్, నల్గొండ జిల్లాలో గట్టుప్పల్ మండలాలు కొలువు తీరనున్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిజాంపేట్ మండలంగా మారనుంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో డోంగ్లి మండలం ఏర్పాటు కానుంది. జగిత్యాల జిల్లాలో జగిత్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎండపల్లి, కోరుట్ల డివిజన్ పరిధిలో భీమారం మండలాలు ఏర్పాటు కానున్నాయి. అభ్యంతరాలకు 15 రోజులు..: కొత్త మండలాల ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిపై 15 రోజుల్లోగా అభ్యంతరాలు, వినతులను సంబంధిత జిల్లాల కలెక్టర్లకు అందించాల్సి ఉంటుంది. వాటన్నింటినీ పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేయనుంది

# భారత స్వాతంత్ర్యవజ్రోత్సవ ద్విసప్తాహం



(మొదటి పేజి తరువాయి) భిన్న సంస్కృతులతో, విభిన్న భాషలు, మతాలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలతో అత్యున్నత ప్రాపంచిక సార్వజనీన విలువలతో భిన్నత్వంలో ఏకత్వాన్ని కొనసాగిస్తున్నది. ప్రపంచ దేశాల్లో భారతదేశానిది విలక్షణమైన సాంస్కృతిక జీవన విధానం. మారుతున్న కాలంలో పెరుగుతున్న సాంకేతికత పని ఒత్తిడి, ఆర్థిక అవసరాల నేపథ్యంలో నాటితరం ఆచరించిన దేశభక్తి కానీ.. అంతటి భావోద్వేగం కానీ నేటి యువతలో ప్రదర్శితమౌ తలేవు. ఇటువంటి వాతావర ణాన్ని మనం పునః సమీక్షిం చుకోవాల్సివున్నది. ఈ నేప థ్యంలో స్వతంత్య భారత వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకోవాల్సిన అక్కెర దేశ భక్తులైన తెలంగాణ బిడ్డల కున్నది. ఈ మేరకు ప్లలె పట్నం ఒకటై భారతావని ఘనకీర్తిని చాటాల్సి ఉన్నది' అని సీఎం కేసీఆర్ తెలిపారు. ÷ూష్ట్రంలోని ప్రతి ఇంటిమీద జాతీయ పతాకం ఎగరాలని సీఎం అన్నారు. అందుకు అవసరమైన 1 కోటి 20 లక్షల త్రివర్ణ పతాకాల తయారీకి ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ అన్నారు. ఇందుకు గద్వాల, నారాయణ పేట్, సిరిసిల్ల, పోచంపెల్లి, భువనగిరి వరంగల్ తదితర ప్రాంతాల్లోని చేనేత పవర్ లూమ్ కార్మికులకు ఆర్డర్లు ఇవ్వాలని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం మీద జాతీయ పతాకాన్ని అత్యున్నతంగా ఎగరవేయాలన్నారు. జాతీయ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని జీఏడీ అధికారులను సీఎం ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ వాహనం మీద జాతీయ జెండా ఎగిరేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా జండాలను రూపొందించా లన్నారు. ఇందుకోసం అవసరమయ్యే జాతీయ పతాకాల ముద్రాణా ఖర్చు సహా దేశభక్తి ప్రచార కార్యక్రమాలకోసం ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని సీఎం స్పష్టం చేశారు. ÷ూష్ట్రంలోని ప్రజా సంచార ప్రాంతాలు, బస్టాండ్లు ప్రాంగణాలు, రైల్వే స్టేషన్లు, సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్, పట్టణాల్లోని స్టార్ హోటల్స్ సహా ప్రధాన కూడల్లు రహదారుల వెంట అనువైన చోటల్లా దేశభక్తి స్ఫూర్తిని జాలువారేలా జాతీయ జెండా రెపరెపలాడేలా చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్, సీఎస్ సోమేశ్ కుమార్‌ను ఆదేశించారు. ప్రజలు ఉద్యోగుల నడుమ సత్సంబంధాలు పెంపొందించే ఫ్రెండ్లీ ప్రభుత్వ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఉద్యోగుల్లో కూడా దేశభక్తిని రగిలించే సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మండల జిల్లా రాష్ట్ర స్థాయిల్లో ఫ్రీడం రన్' లను నిర్వహించాలన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల వారి సారథ్యంలో ప్లలె నుంచి పట్నం దాకా స్వాతంత్య వజ్రోత్సవ దీప్తిని వెలిగించే దిశగా తగు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. తెలంగాణనుంచి, దేశంలోని పలు ప్రాంతాలనుంచి, దేశ స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న నాటితరం జాతీయ నాయకుల వివరాలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు యువత కోసం అర్థమయ్యే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.పీజీ డిగ్రీ జూనియర్ కళాశాలలు సహా గురుకులాలు తదితర ప్రభుత్వ ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు సహా అన్ని రకాల విద్యాసంస్థల్లో పంద్రాగస్ట్‌కు ముందు వారం రోజులు, పంద్రాగస్టుకు తర్వాత వారం రోజులు మొత్తం 15రోజుల పాటు నిర్వహించబోయే 'స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహం' కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అధికారులకు వివరించారు. ఇందులో.. ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు, వకృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు, దేశభక్తిగీతాల పోటీలు, నాటికలు, ఏకపాత్రాభినయం తదితర దేశభక్తిని ఉద్దీపన చేసే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ మంత్రి, కార్యదర్శి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహం' కార్యక్రమాల్లో పోలీసు సహా అన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొనాలని సీఎం అన్నారు. ఆయా శాఖల ఉద్యోగులు పదిహేను రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల రోజువారీ షెడ్యూలను రూపొందించుకుని రెండు వారాల పాటు అమలు చేయాలని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధనాల రూపకల్పన కోసం ప్రత్యేక కమిటీని నియమించాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సహా సర్పంచ్ స్థాయి ప్రజా ప్రతినిధులతో పాటు, ప్రభుత్వ కార్యదర్శులు సహా ఉన్నతాధికారులు వారి వారి లెటర్ ప్యాడ్లమీద జాతీయ జెండా బొమ్మను ముద్రించుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. పదిహేను రోజుల పాటు పత్రికల మాస్టర్ హెడ్స్ మీద జాతీయ పతాక చిహ్నాన్ని ముద్రించాలని, టీవీ ఛానల్స్‌లో 15 రోజుల పాటు జాతీయ పతాక చిహ్నాన్ని నిత్యం కనిపించేలా ప్రసారం చేయాలని ఆయా మీడియా యాజమాన్యాలకు సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.

# రాజకీయపార్టీలు పక్షపాత ధోరణి వీడాలి

(మొదటి పేజి తరువాయి) పార్లమెంట్ సభ్యులతో కూడిన పెద్ద కుటుంబంలో తాను ఒక భాగమని.. కుటుంబంలో భిన్నాభిప్రాయాలు ఉన్నా దేశ ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు దేశ ప్రయోజనాల దృష్ట్యా పక్షపాత రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్? కోవింద్ పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే హక్కు నేతలకు ఉందని.. కానీ దాని కోసం అందరూ గాంధేయవాదాన్ని అనుసరించాలని సూచించారు. రాష్ట్రపతిగా దేశానికి సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయమని కోవింద్ అభివర్ణించారు. పార్లమెంట్ సభ్యులతో కూడిన పెద్ద కుటుంబంలో తాను ఒక భాగమని.. కుటుంబంలో భిన్నాభిప్రాయాలు ఉన్నా దేశ ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు.

# నేడు హైదరాబాద్‌లో బోనాల జాతర

## రెండ్రోజుల పాటు వైన్ షాపుల మూత




**హైదరాబాద్, జూలై 23 (సమ సమాజం):** బోనాల సందర్భంగా గ్రేటర్ పరిధిలో మద్యం దుకాణాలకు సెలవు ప్రకటిస్తూ.. హైదరాబాద్ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఆది, సోమవారాల్లో వైన్ షాపులు పూర్తిగా బంద్ కానున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్ లు కూడా మూతపడనున్నాయి. మంగళవారం యధావిధిగా తెరుచుకోనున్నాయి. దీంతో మందుబాబులు మద్యం దుకాణాల వైపు పరుగులు తీసారు. ముందుగానే బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో వైన్స్ షాపుల ముందు విపరీతమైన రద్దీ నెలకొంది. అక్రమంగా మద్యం విక్రయిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నగరంలో ఉన్న మద్యం దుకాణాలను నిశితంగా పరిశీలించడంతో పాటు నిఘా ఉంటుందన్నారు. ఇదిలావుంటే శాలిబండ హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయంలో భక్తులు నైవేద్యాలు సమర్పించనున్నారు. సోమవారంతో వేడుకలు ముగుస్తాయి. ఇక బోనాల విషయానికి వస్తే... ఆషాఢ మాసంలో ఈ పండుగను నిర్వహించుకుంటుంటారు. తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో ప్రతి ఆదివారం ఒక్కొక్క ప్రదేశంలో బోనాల జాతర జరుగుతుంటుంది. తెలంగాణ సంస్కృతికి తలమానికంగా భావించే ఈ బోనాలు తొలుత గోల్కొండలో జూన్ 30న బోనాలు ప్రారంభమయ్యాయి. జూలై 17న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి బోనాలు జరిగాయి. జూలై 24న భాగ్యనగరంలో వివిధ ప్రాంతాల్లో బోనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలై 25న దేవాలయాల్లో ఘట్టాల ఊరేగింపు అట్టహాసంగా జరుగనుంది. జూలై 28న గోల్కొండలో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. లాల్ దర్వాజ మహంకాళి బోనాలు జరుగనున్నాయి.

# దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజి తరువాయి) పరిశీలించాలని, అందుకు మీ అందర్నీ ప్రోత్సాహిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రమోట్ చేసేందుకు తెలంగాణ చాంపియన్ స్టేట్‌గా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా తెలంగాణ పెట్టుబడులను ఆకర్శించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పడానికి తాను గర్వపడుతున్నానని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజి తరువాయి) ప్రాణనష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశించారు. వరుసగా రెండు రోజులు సెలవు రోజులు వస్తున్నందున, సెలవులను ఉపయోగించకుండా పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సీఎస్ శనివారం జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కురుస్తున్న క్రమంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున వరదలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో అన్ని రిజర్వాయర్లు, చెరువులు పూర్తిగా నిండినందున చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు, వంతెనలు దెబ్బతిన్న మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేయాలని చెప్పారు. పోలీసు, నీటిపారుదల, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలన్ని సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# విమానంలో ప్రయాణికుడికి ఉపశమనం

(మొదటి పేజి తరువాయి) గవర్నర్ వెంటనే స్పందించి ఆ ప్రయాణికుడికి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రయాణికుడికి భరోసా ఇచ్చి ఉపశమనం కలిగించారు. వెంటనే కోలుకున్న ప్రయాణికుడు చికిత్స అందించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. ఇతర ప్రయాణికులు కూడా గవర్నర్‌ను ప్రసంసించారు. అలాగే సరైన సమయంలో స్పందించిన విమాన సిబ్బందిని గవర్నర్ అభినందించారు. ఆ విమానంలో ప్రయాణిస్తున్న ఇతర ప్రయాణికులు తమిళిసైకు అభినందనలు తెలిపారు. గవర్నర్ తమిళిసై ప్రయాణికుడికి చికిత్స చేస్తున్న సమయంలో మరో ప్రయాణికుడు ఫోటోలు తీసి ట్విట్టర్ లో షేర్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇక గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వైద్యురాలు. ఎంబిబిఎస్, ఎండి డిజిఓ లాంటి వైద్య విద్య కోర్సులు ఆమె చేసింది.

# అతిగా వ్యవహరిస్తున్న మీడియా

(మొదటి పేజి తరువాయి) తీస్తున్నారని రమణ ఆరోపించారు. అతి దూకుడు, బాధ్యతారాహిత్యం వల్ల మన ప్రజాస్వామ్యాన్ని రెండు అడుగులు వెనక్కి తీసుకువెళ్తున్నట్లు మీడియాపై చీఫ్ జస్టిస్ సీరియస్ అయ్యారు. ప్రింట్ మీడియా ఇంకా కాస్త జవాబుదారీగా వ్యవహరిస్తోందని, కానీ ఎలక్ట్రానిక్ మీడియా మాత్రం జీరో జవాబుదారీతనంతో ఉందని ఎన్వీ రమణ అన్నారు. ఇటీవల కాలంలో న్యాయమూర్తులపై భౌతికదాడులు పెరుగుతున్నాయని, ఎటువంటి రక్షణ లేకుండానే జడ్జిలు సమాజంలో జీవించాల్సి వస్తోందన్నారు. రాజకీయవేత్తలు, అధికారులు, పోలీసు ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులకు రిటైర్మెంట్ తర్వాత కూడా సెక్యూర్టీ కల్పిస్తున్నారని, కానీ జడ్జిలకు ఇదే తరహా రక్షణ లేకుండాపోయిందన్నారు. నిర్ణయాత్మక కేసుల్లో మీడియా విచారణ సరైంది కాదన్నారు. బేధాభిప్రాయాలను ప్రచారం చేస్తున్న మీడియా.. ప్రజల్లో వైరుధ్యాన్ని పెంచుతోందన్నారు. దీంతో ప్రజాస్వామ్యం బలహీనపడుతోందన్నారు. ఇది వ్యవస్థను దెబ్బతీస్తోందన్నారు. ఈ క్రమంలో న్యాయవ్యవస్థపై పెను ప్రభావం పడుతోందన్నారు. సోషల్ మీడియా పరిస్థితి మరీ దారుణంగా ఉందని సీజే అన్నారు. స్వీయ నియంత్రణతో మీడియా ఉండాలని ఆయన కోరారు. పదాలను మీడియా జాగ్రత్తగా వాడాలన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రజలను విద్యావంతులను చేసేందుకు, చైతన్యపరిచేందుకు ఎలక్ట్రానిక్ మీడియా తన గళాన్ని వాడుకోవాలని సీజే రమణ సూచించారు.

# రాజ్‌భవన్‌లో బోనాల సందడి

(మొదటి పేజి తరువాయి) బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల పండుగలో రాజ్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు. రాజ్ భవన్‌లో నివసించే కుటుంబాలతో కలిసి గవర్నర్ తమిళిసై సౌంద రరాజన్ బోనాల పండుగ నిర్వహించు కున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ గవర్నర్ తమిలిసై సౌందరరాజన్ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయా లకు ప్రతీక బోనాల పండుగ అని చెప్పారు. తెలంగాణలో అన్ని దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారని..ముఖ్యంగా బోనాల పండుగ వెనుక ఎంతో చరిత్ర ఉందన్నారు. అషాడ, శ్రావణ మాసాల్లో బోనాల పండుగను ఎంతో భక్తితో నిర్వహిస్తారన్నారు. ఆషాడ మాసంలో ఎక్కువగా నల్ల పోచమ్మను కొలుస్తారని చెప్పిన గవర్నర్.. ఈ సంవత్సరం బోనాల పండగ నిర్వహిం చేందుకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. అమ్మవారి దయవల్ల సాధారణ పరిస్థి తులు నెలకొన్నాయని తెలి పారు. అమ్మవారి ఆశీస్సు లు అందరిపై ఉండాలని గవర్నర్ తమిళసై కోరుకున్నారు. అటు దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నందున ప్రతీ ఒక్కరు బస్టర్ డోస్ వేసుకోవాలని గవర్నర్ తమిళసై సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తుందని.. నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని...ప్రజలు అప్రమత్తంగా ఉండా లని గవర్నర్ సూచించారు.

## మరోసారి గర్జించిన వరుణుడు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్**



**ఆందోల్, జులై 23 (సమ సమాజం):** వర్షాల పేరు చెబితేనే జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిన్న మొన్నటిదాకా భారీ వర్షాల తో జనం అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆ వర్షాలకు ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఇప్పుడు మరోసారి వరుణుడు గర్జించనున్నాడు. రానున్న రెండు రోజులు తెలంగాణ, కోస్తా, రాయలసీ మల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేసింది. ఈ హెచ్చరిక అదేశాలమేరకు నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలిపారు.ఉపరితల ద్రోణి ప్రభావంతో మరో రెండురోజులు భారీ వర్షాలు కురుస్తాయి. ఈ వర్షాల పట్ల ఆందోల్ నియోజకవర్గ ప్రజలందరు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా సింగూర్ కలువ పరివాహ ప్రాంతాల ప్రజలు, చేపల వేటకు వెళ్లవద్దని, అలాగే పశువుల కాపరిలు, మరియు ప్రజలు జగ్రతగా ఉండాలని, ఏదైన అవసరం అయితే, తప్ప బయటకి రాకూడదన్నారు. పురాతన ఇళ్లలో నివాసం ఉంటున్నవారు సమీపంలోని ప్రభుత్వ భవనములను ఉపయోగించుకోవాలని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు.గ్రామాలలో చెరువులు కుంటల వద్దకు వెల్లోదని అయన కొరారు. గౌరవ ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాలలో ప్రజలను చైతన్య పరచవలసిందిగా కోరారు. ఏదైనా సహాయ, పనులకు ఇబ్బందిగా ఉన్నచో నియోజక వర్గంలోని తహసిల్దార్ లకు, ఎంపీడీవోలకు, మున్సిపల్, పోలీస్ అధికారులకు, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామస్థాయి అధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

## మానవత్వాన్ని చాటిన మున్సిపల్ అధికారి వినయ్ కుమార్

**అందోల్, జులై 23 (సమ సమాజం):** మానవత్వ విలువలు మంటగలుస్తున్న ఈ కాలంలో ఏ సంబంధం లేని ఓ అధికారి కొన ఊపిరితో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని అంబులెన్స్ లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తీసుకువచ్చి అడ్మిట్ చేయించి సరైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపల్ పరిధి అయిన 19 వ వార్డు లోని స్వప్న మ్యాచింగ్ సెంటర్ సమీపాన ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటాన్ని చూసిన ఆ వార్డు కౌన్సిలర్ కుమారుడు రవీందర్ గౌడ్ వెంటనే మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ కి ఫోన్లో సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ అధికారి వినయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నచోటకు వచ్చి చూడగా ప్రాణాపాయ స్థితిలో పడి ఉండటాన్ని చూసి వెంటనే అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి అడ్మిట్ చేయించి సరైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ. గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నారని సమాచారం రావడంతో సంఘటన స్థలికి చేరుకొని చూడగా కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కానీ మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

**రాయికోడ్, జులై 23 (సమ సమాజం):** రాష్ట్రంలో అభం శుభం తెలియని చిన్నారులపై, మహిళలపై లైంగిక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కామాంధులు నిత్యం పసి మొగ్గల బ్రతుకులను చిద్రం చేస్తూనే ఉన్నారు. చాక్లెట్ ఇస్తానని ఆశ చూపి చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన రాయికోడ్ మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాయికోడ్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారి తమ ఇంటి ముందు గురువారం సాయంత్రం ఆడుకుంటున్నది. దాదాపు 7 గంటల ప్రాంతంలో చిన్నారి కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో గ్రామానికి చెందిన సర్దార్ (30) అనే వ్యక్తి చాక్లెట్ ఇస్తానని ఆశ చూపి గ్రామానికి కొద్దిదూరంలో జన సంచారం లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారిపై అత్యాచారానికి యత్నించగా భయపడిన చిన్నారి బిగ్గరగా ఏడవడంతో నిందితుడు పారిపోయాడు. చిన్నారి ఇంట్లో తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పగా, వారు రాయికోడ్ పోలిస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీస్ సిబ్బంది శనివారం నాడు నిందితుని జహీరాబాద్ పట్టణంలో ఒక్క హెూటల్ లో అదుపులోకి తీసుకున్నామన్ని ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

## నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలం

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టర్లు**

**సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్**

**సిద్దిపేట మైనార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ అతీక్.**

**సిద్దిపేట్, జులై 23(సమ సమాజం):** హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ సిద్దిపేట మైనార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ అతీక్. మండిపడ్డారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం పై పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సన్నబియ్యం ఇస్తామని చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లకు దొడ్డు బియ్యం సరఫరా చేసిందని ఆరోపించారు. ఉడికి ఉడకని అన్నం నీళ్ల చారు తో విద్యార్థులు తమ కడుపులు నింపుకోవడం చాలా బాధాకరమన్నారు. ఉదయం విద్యార్థులకు టిఫిన్ కూడా చేయడం లేదని నీళ్ల పాలు, ఒక అరటిపండు మాత్రమే ఇవ్వడం దారుణం అన్నారు. దీనిపై పాఠశాల సిబ్బందిని అడుగగా, వార్డెన్ శనివారం ఉదయం రాలేదని అందుకే పెట్టలేదని జవాబు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మండిపడ్డారు. ఇదే విషయమై డి ఆర్ డి ఓ గోపాలరావు అడగగా ప్రభుత్వం సప్లై చేస్తుందని ఆ మేరకే మేము పంపిణీ చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం రాత్రి భోజనంలో మెనూ ప్రకారం వంటలు చేయడం లేదని, కేవలం నీళ్ల చారు ఒక కూర మాత్రం పెట్టడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సిన ప్రభుత్వం కాంట్రాక్టర్ల జేబులు నిండేలా కోట్లది రూపాయలను ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. సిద్దిపేట పట్టణంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక జిల్లాలోని హాస్టల్లో ఇంకెలా ఉందో అర్థమవుతుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని చెప్పారు. టిఆర్ఎస్ ప్రభుత్వం తమ కార్యక్రమాల్లో సన్నబియ్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా హాస్టళ్లకు ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయాలని లేకపోతే త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్.ఎస్.యు.ఐ నాయకులతో కలిసి హాస్టళ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు ఫస్ యుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు నీటి విడుదలతో మంజీరా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**మెదక్, జులై 23 (సమ సమాజం):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్.పి డా.శ్రీ.బి.బాలస్వామి ఐ.పి.ఎస్ గారు మాట్లాడుతూ... సింగూరు నీటి విడుదలతో సింగూరు నుంచి ఏడుపాయల మీదుగా మెదక్ జిల్లాకు వచ్చే వరద నీటిని విడుదల చేయడంతో ఈ ప్రాంత ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు శాఖ అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ప్రస్తుతం నీరు సింగూరు నుంచి నీటిని విడుదల చేసినందన ఏడుపాయలలో నీటి ప్రవాహం వస్తున్నందున మంజీర నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతానికి ప్రజలు రాకుండా అవసరమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని మంజీరా పరివాహక ప్రదేశాల్లో ఉన్న రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... పాత ఇళ్ళు,కూలిపోయే స్థితిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను, ఇళ్ళ తగు జాగ్రత్తలు పాటించాలని వీలైనంత వరకు అట్టి వాటిలో ఉండకూడదని ఇక ముందు రోజుల్లో కూడా వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసమైతే తప్ప బయటకు రావద్దని... ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజల యోగక్షేమాల కోసం ఎల్లప్పుడూ పోలీస్ శాఖ పని చేస్తోందని తెలిపారు. తమ తమ పోలీస్ స్టేషన్ ల పరిదిలలో డ్యామ్ లు, చెరువులు, కుంటలు, అలుగులు పారే ప్రదేశాలను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అక్కడి ప్రాంత ప్రజలకు వరద ప్రమాదాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే వర్షాల కారణంగా విద్యుత్ స్థంబాలకు ఎర్తింగ్ ద్వారా విధ్యుత్ సరఫరా అయ్యి కరెంట్ షాక్ తగిలే అవకాశం వున్నందున జిల్లా ప్రజలు పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్థంబాలను కానీ విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా జాగ్రత్తగా వుండాలని, ముఖ్యంగా వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలకు వెళ్ళే రైతులు బోర్ మోటారు వేసే సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే దయల్ 100 కానీ పోలీస్ స్టేషన్ కి కానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ 08452-223533, 7330671900 కి సమాచారం ఇవ్వాలని అన్నారు.

## వయో వృద్ధులు, దివ్యాంగులపై ప్రేమాప్యాయతలు పంచాలి

**జిల్లా అదనపు ఎస్.పి డా.బి.బాలస్వామి ఐ.పి.ఎస్.**



**మెదక్, జులై23 (సమ సమాజం):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్.పి డా.శ్రీ.బి.బాలస్వామి ఐ.పి.ఎస్ గారు నేషనల్ హెల్ప్ లైన్ ఫర్ సీనియర్ సిటిజన్ నంబర్ పోస్టర్ ని విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్.పి డా..బి.బాలస్వామి ఐ.పి.ఎస్ గారు మాట్లాడుతూ... వృద్ధులపై వేధింపులు ఆపాలని ప్రతి ఒక్కరు వయోవృద్ధుల పట్ల గౌరవంతొ మెలగాలని తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసులో ఎంత ప్రేమగా పోషించారో అదేవిధంగా పిల్లలు కూడా తమ వయోవృద్ధ తల్లిదండ్రులను ప్రేమతో చూసుకోవాలి అని తెలిపారు. వయో వృద్ధులు ఎటువంటి వేధింపులకు గురైన, వయోవృద్ధుల సహాయక నెంబర్ నెంబర్ -14567 కి కాల్ చేస్తే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. అలాగే నేషనల్ హెల్ప్ లైన్ ఫర్ సీనియర్ సిటిజన్ అనే పేరుతో, వికలాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 14567 వయో వృద్ధులకు మరియు వికలాంగులకు 1800572980 హెల్ప్ లైన్ లని నడుపుతున్నదని ఈ హెల్ప్ లైన్ ద్వారా నిరాశ్రయులకు ఆదరణ, వేదింపులకు గురౌతున్న పెద్దల సంరక్షణ మానసిక భావోద్వేగాలకు సలహా మరియు సూచనలు, చట్టపరమైన మార్గదర్శకత్వం మరియు వృద్ధాశ్రమాలు /సంరక్షకులు/ కాలక్షేప కేంద్రాల గురించిన సమాచారం అందిస్తారని వివరించారు. హెల్ప్ లైన్ ఫర్ సీనియర్ సిటిజన్ నంబర్ 14567 ఉ 8.00 గం - రాత్రి 8.00 గం వరకు అందుబాటులో ఉంటుందని అలాగే దివ్యాంగుల హెల్ప్ లైన్ నంబర్ 1800572980 ఉ 09.00 గం సాయంత్రం 06.00 గం వరకు అందుబాటులో ఉంటుందని అన్నారు. జిల్లా ప్రజలు వారి పెద్దల కొరకు ఈ సేవలను ఉపయోగించుకోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీ.సురపనాయుడు గారు,ఐ.టి కోర్ ఎస్.ఐ శ్రీ.సందీప్ రెడ్డి గారు, %ఖీ=హా% శ్రీ.బాలరాజు గారు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలి

**టేక్మాల్ ఎస్సై బి, లింగం**



**టేక్మాల్, జులై 23(సమ సమాజం):** మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తాగు జాగ్రతలు తీసుకోవాలని అలాగే ఎవరైనా మీ సెల్ ఫోన్ నెంబర్ కు ఆధార్ తో పాటు బ్యాంకు ఖాతాలు, భూముల వివరాలు, ఉద్యోగ సమాచారం వంటివి అనుసంధానం చేస్తూ లావాదేవీలు చేస్తున్నట్లయితే జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రజలకు టేక్మాల్ ఎస్ఐ లింగం సూచించారు. వీటి వల్లే సైబర్ నేరగాళ్ల పని సులువవుతోందని, ఫోన్ నెంబర్ ను సేకరించి దానికి ఉన్న యూపీఐ ఐడీని తెలుసుకోవడానికి అనేక రకాల లింకులను,సృష్టిస్తున్నారన్నారు. అమాయకంగా ప్రజలు లింకును నొక్కితే ఖాతాలోని డబ్బులు,కజేస్తుంటారని ఆయన తెలిపారు. మోసగాళ్లు తయారు చేసిన ప్రోగ్రామింగ్ యాప్ నుంచి మి బ్యాంక్ ఖాతా నిలిచిపోయిందని, గూగుల్ పే, ఫోన్ పే ఇకపై వాడలేరని, లేదంటే పర్సనల్ లోన్ మీ నెంబర్ కు అప్రూవల్ అయిందని, కంపెనీ డీలర్షిప్ కల్పిస్తామని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇలా పలు సందర్భాల్లో యాప్ లను పరిశీలిస్తున్న వారిని ఎంచుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సెల్ ఫోన్లకు వచ్చిన మెసేజ్లు నకిలీనో, ఒర్జనల్లో తెలియక ప్రజలు కంగారంలో సదరు మెసేజ్ లింకును నొక్కగానే వారి ఖాతాలోంచి డబ్బులను నొక్కేస్తున్నారని, దీనిపట్ల ప్రజల్లో అవగాహన రావాలని, ఇలాంటి నేరాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై బి, లింగం తెలుపడం జరిగింది.




## మాచర్ల నియోజకవర్గం నుంచి మెలోడీ సాంగ్

యంగ్ హీరో నితిన్ ప్రాధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాచర్ల నియోజకవర్గం'. ప్రముఖ ఎడిటర్ ఎంఎస్.రాజశేఖర్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ప్రేమ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే నితిన్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి యాక్షన్ రోల్‌ను పోషించాడు. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలకు క్రియేట్ చేశాడు. యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్టు 12న విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస అప్‌డేట్‌లతో సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమాలోని థర్డ్ సింగిల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. 'అదిరింది' అంటూ సాగే మెలోడియస్ వీడియో సాంగ్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ పాటలో నితిన్, కృతి శెట్టి మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. వీరిద్దరి డ్యాన్స్ మూవ్‌మెంట్స్ అలరిస్తున్నాయి. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటను సంజిత్ హెగ్డే ఆలపించాడు. దిగ్గజ స్వర కర్త మణిరత్నం కుమారుడు మహతి స్వరసాగర్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చాడు. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'రా రా రెడ్డి' లిరికల్ సాంగ్ యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రంలో నితిన్ గుంటూరు జిల్లా కలెక్టర్‌గా కనిపించనున్నాడు. కృతిశెట్టి, క్యాథరీన్ థెరిస్సా హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని ఆదిత్య మూవీస్ /ఎంట్టంల్గ÷నమెంట్స్, శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్లపై ఎన్.సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మించారు.




## కోబ్రాపైనే విక్రమ్ ఆశలు

చియాన్ విక్రమ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. వెండితెరపై ఈయన చేసిన ప్రయోగాల గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కోలీవుడ్‌లో కమల్ తర్వాత ఎక్కువగా ప్రయోగాలు చేసిందే విక్రమ్ మాత్రమే అని తమిళ తంబిలు చెబుతుంటారు. 'శివపుత్రుడు', 'అపరిచితుడు', 'ఐ', 'ఇంకొక్కడు' ఇలా పలు సినిమాల్లో ప్రయోగాలు చేసి విలక్షణ నటుడుగా పేరు తెచ్చుకున్నాడు. అయితే గత కొంత కాలంగా ఈయన నటించిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఈయన నటించిన 'కోబ్రా' పైనే విక్రమ్ ఆశలన్ని పెట్టుకున్నాడు. అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై ప్రేక్షకులలో మంచి అంచనాలే ఉన్నాయి. చిత్రం నుండి విడుదలైన విక్రమ్ పోస్టర్‌లు అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విక్రమ్ ఏడు రకాల పాత్రల్లో కనిపించనున్నాడట. అంతే కాకుండా ఈ ఏడు పాత్రలకు తనే డబ్బింగ్ చెప్పాడట. పాత్ర తీరును బట్టి, వివిధ వేరియేషన్స్‌లో వాయిస్ మాడ్యులేషన్ ఉంటుందట. ఇలా ఏడు రకాలుగా గొంతు మార్చి మాట్లాడటం అంటే విశేషం అనే చెప్పాలి. ఇందులో నిజమెంతుందో తెలియాలంటే సినిమా విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో 'కేజీఎఫ్' భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. ఏ.ఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై ఎస్.ఎస్. లలిత్ కుమార్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాడు. ప్రముఖ క్రికెటర్ ఇర్ఫాన్ ఖాన్ ఈ చిత్రంలో ప్రతి నాయకుడి పాత్రలో నటించాడు.కాగా ఈ చిత్రాన్ని ముందుగా ఆగస్టు 11న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా ఈ చిత్రం విడుదల వాయిదా పడ్డట్లు తెలుస్తుంది. సీజి కారణంగా విడుదల పోస్ట్ పోన్ అయిందని కోలీవుడ్ వర్గాల సమాచారం.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in